# పంచాంగ కర్త అంటే?

నవగ్రహాల యొక్క నక్షత్రాల యొక్క, కాలమాన స్థితిగతులను సాటి మనిషికి తెలియపరిచే బాధ్యత పంచాంగకర్త. యితని యజమానులు నవగ్రహాలు. ఈ పంచాంగ కర్త తప్పుడు కాలమానాలను సాటి మనిషికి తెలియపరచిన యెడల అతగాడు నవగ్రహాల శాపం పొందును. పంచాంగ కర్త రూపొందించిన శుభముహూర్తం యొక్క మొత్తం దుష్పరిణామాలు అన్నీ ఆ పంచాంగకర్తకే ప్రాప్తిస్తాయి. నవగ్రహ శాపాలు, బాధితులు ఉసుర్లు, వేదనలను సంపాదించుకొన్న ధనాస్తులు తొలగించలేవు అన్నది గురువుల ఉద్బోధన.

ఒకసారి బహుశా రెండు సంవత్సరాల క్రితం నావద్దకి ఒక వ్యక్తి వచ్చి కాశీ విద్యాపీఠం వారు మొట్టమొదటగా రూపొందించి అనేక మంది గణితం చేసి తయారు చేసి ముద్రించిన వంద సంవత్సరాల శతాబ్ది పంచాంగాన్ని తను అనువదించి తన మాతృభాషలో ప్రింట్‌చేయాలని భావిస్తున్నానని నాతో చెప్పడం జరిగింది.

అంతటి ఘోరమైన పాపం మరొకటి ఉండదనియు, అలాంటి పనిచేస్తే అనగా ఎందరో మేధావులు ఎన్నో సంవత్సరాలు కష్టపడి రూపొందించిన పంచాగాన్ని కాపీ చేయడం అనేదానిని సాక్షాత్తూ ఆ నవగ్రహాలు సహించవు, శపిస్తాయి సుమా. అలాంటి సరస్వతీ ద్రోహం వలన తాత్కాలిక ధన ప్రాప్తి మాత్రమే, ఆ తదుపరి  వంశాలన్నీ శాపగ్రస్తుమయి పోతాయని నేను చెప్పడం వలన అతగాడు తన ఆలోచనను విరమించుకొన్నాని తెలిపాడు.

తనకు శతాబ్ది పంచాంగకర్త అనిపించుకొవాలనే కోరకి వలన అలా ఆలోచించాననియు, అసలు శతాబ్ది పంచాంగంలో ఏర్పడిన గణితం పొరపాట్లు తన భాషలోకి తర్జుమా చేసినపుడు అదే విధంగా ఉండి పాఠకుల చేత అపహాస్యం పాలు అవ్వడం జరుగునని భావించి ఆ వ్యక్తి అలాంటి ఆలోచనను విరమించుకొన్నాడు.

సాధారణంగా ఒక సంవత్సరం పంచాంగం వ్రాయాలంటే తనకు నాలుగు లేదా ఐదు నెలలు పడుతుందనియు, వంద సంవత్సరాల  పంచాంగం వ్రాయడానికి తన జీవిత కాలం చాలదనే ఆలోచనతో తనకు  అలాంటి దుర్భిద్ధి అందునా సరస్వతీ తల్లిపట్ల కలగడం తన దురదృష్టం అని అతను పశ్చాత్తాప పడ్డాడు, ఆలోచనకు స్వస్తి పలికాడు.